# కథ కావాలి

శ్రీ కేవస్వీ

'బా-వా!...'

అంటూ రివ్వున లోపలికొచ్చింది రమ.

మేడ మెట్లు తొందరగా ఎక్కివచ్చిన ఆయాసాన్ని, తన కిష్టమైన మనిషిని చాలాకాలం తర్వాత చూస్తున్నానన్న భావనవల్ల కలిగిన ఆనందంతో కూడిన నవ్వులో నొక్కిపట్టి—గాలిలా వచ్చి రాజు మేజామీద వాలిపోయింది రమ. నవ్వుతూ నవ్వుతూ రాజువంక చూసి, మేజామీంచి కుర్చీలోకి చేపపిల్లలా జారిపోయింది. 'బావా—నేనొచ్చేసేను—' అంది ఇంకా రొప్పుతూనే.

అంతవరకూ కిటికీగుండా వెలుపలికి చూస్తూ ఉండి అప్పుడే తల ఇటు తిప్పిన రాజు రమను చూసి ఆశ్చర్యపోలేదు.

ఆశ్చర్యమేకాదు, అతని ముఖంలో ఆనందం కూడా లేదు.

అతని జుత్తు అతని ముఖంమీద అస్తవ్యస్తంగా పడి ఉంది. అతని కళ్లు ఆమెవేపు తిరిగినా అతని చూపుల్లో కేవలం శూన్యత మాత్రమే ఉంది. ఏదో గడ్డుసమస్యకి పరిష్కారం వెదుకుతున్నట్టు అతని కనుబొమలు ముడిబడి ఉన్నాయి.

అతని ఆ భంగిమ చూసి ఆశ్చర్యపోయింది రమ. 'ఏమిటి బావా—అలా ఉన్నావ్?—' అని అడిగింది.

ఆమె మాటకి అతను సమాధానం ఏమీ ఇవ్వలేదు. తనలో తాను ఏదో గుణించుకున్నట్టు గణించుకున్నట్టు— ఆమె వేపు అలాగే నిశ్చలంగా చూసేడు.

'ఏమిటి బావా అలా చూస్తావ్? ఏమైందిప్పుడు? అంది రమ, మరింత ఆశ్చర్యాన్ని కలవరపాటుతో కలిపి వ్యక్తం చేస్తూ.

'కథ కావాలి రమా— నా కిప్పుడు అర్జంటుగా ఒక కథ కావాలి...' అన్నాడు రాజు.

నిర్ఘాంతపోయింది రమ.

రాజువంక చూస్తున్న ఆమె కళ్ళు మరింతగా విచ్చుకున్నాయి.

అతను అన్నదేమిటి?

అతణ్ణి చూడాలన్న కోరికతో రెండు రైళ్ళు మారిన ప్రయాణపు టలసటనూ కూడా మరిచిపోయి, వచ్చింది వచ్చినట్లే మేడమెట్లెక్కి అతని గదిలోకి వస్తే—

'నువ్వా రమా! ఎప్పుడొచ్చే వెప్పుడొచ్చేవ్? అంటూ కళ్ళలో గెంతులేసే ఆనందంతో తనని పలకరించలేదు. 'ప్రయాణం కులాసాగా జరిగిందా?—' అంటూ పరామర్శించలేదు. పోనీ, తనంతటతానే పలకరించినప్పుడైనా తన రాకని గుర్తించినట్టు కనిపించలేదు. 'బావా— నేనొచ్చేసేను!—' అంటూ పట్టరాని సంతోషంతో తను చెప్పినందుకు అతని సమాధానం

'కథ కావాలి!...'.. !!

'కథా? కథేమిటి బావా?—' అంది రమ రాజు వంక చిత్రంగా చూస్తూ.

'కథే రమా— కథే కావాలి ... ఇవాళ తారీఖు పద్దెనిమిది — ఇంక నాలుగురోజులే టైముంది... ఇరవైరెండోతారీఖు కథలపోటీకి ఆఖరుతేదీ ... ఆ లోపల ఎలాగైనా సరే— ఒక కథ రాయాలి— ఒక మంచి కథ కావాలి రమా—కథ కావాలి...'

రాజు రాసే కథలంటే రమకు చాలా ఇష్టం. తన బావ కథలు రాస్తాడంటే రమకు చాలా గొప్పగా ఉంటుంది. 'మా బావ కథలు రాస్తాడు—'అని ఊళ్ళో

తన స్నేహితురాండ్రందరితోటీ గర్వంగా చెప్పుకుంటుంది. ఏ పత్రికలో బావ కథ అచ్చయినా ఎప్పటికప్పుడు దాన్ని చదివేసి దాన్ని గురించి తనకు తెలిసిన నలుగు రికీ చెప్పుకుంటేగాని ఆమెకు తృప్తి ఉండదు. కాని,

ఎంతగా కథలు రాసినా తన బావ మను ష్యుల్ని మరిచిపోతాడనీ, పట్టించుకోవడం మానేస్తా డనీ అనుకోలేదు రమ.

'కథేమిటి బావా!—ఇప్పుడేమిటి కథ?—'అంది.

'ఇప్పుడే కావాలి రమా...ఎలాగైనా సరే— నువ్వు నాకో మంచి కథ చెప్పాలి...థీమ్‌వరకూ చెప్పు చాలు...మిగతా అంతా నేను పూర్తి చేసు కుంటాను..ప్లీజ్—చెప్పు రమా!!...'

'భలే!—కథలు నాకేం చేతనౌతాయి. బావా!'

'అన్ని కథలు చదువుతావు—ఒక్కకథ చెప్ప లేవూ? ఏదైనా చిన్నకథ చెప్పు చాలు...ట్రాజెడీ అయినా సరే—కామెడీ అయినాసరే—పోనీ—ముగించడ మెలాగో నేను చూసుకుంటాను—ఏదైనా చిన్న 'హింట్' ఇవ్వు చాలు......'

'కథలు—చదవడమైతే చదువుతానుగాని, కల్పిం చడం నాకు చాతకాదు బావా!......'

'పోనీ! ఏదైనా జరిగిన కథైనా చెప్పు...'

'జరిగింది కథ ఎలా ఔతుందీ?'—

చిన్నబుచ్చుకునే పసిపిల్లాడిలా చూసేడు రాజు. 'ఇంత తెలివిగా మాట్లాడతావ్—నువ్వూ కథకురాలివి కావలసింది... పోనీ— కథకు పనికొచ్చే సంఘటన ఏదైనా చెప్పు—మార్పులూ చేర్పులూ చేసి నేను కథ రాసుకుంటాను—'

'భలే!—నేనేమిటి—నీకు చెప్పడమేమిటి?—'

'ఫరవాలేదు—చెప్పు రమా !—'

'ఊహూం—అబ్బే—నేను చెప్పలేను బావా...'

'కానీలే రమా—అయితే చెప్పవ్‌కదూ?'

'అదేమిటి బావా—నాకు చాతనైతే చెప్పనూ? నా వల్లకాదు బావా—ఎక్స్‌క్యూజ్‌మి- '.

'ఇందులో ఎక్స్‌క్యూజ్ చెయ్యడాని కేముందిలే రమా—కాని...నా మాటంటే నీకు ఇంత విలువే నన్న మాట ఉంది......'

రమ రాజువంక తదేకంగా చూసింది—'అపార్థం చేసుకుంటున్నావా బావా...'

'లేదు—ఇప్పుడే సరిగ్గా అర్థం చేసుకుంటు న్నాను రమా—'

'కోప మొచ్చిందా బావా—'

'ఎందుకూ?—అబ్బే !—'

'కథ చెప్పనందుకు—నీ మాట కాదన్నందుకు—'

రాజు ఏమీ అనలేదు.

రమ కూడా ఒక నిమిషంపాటు ఏమీ మాట్లాడలేదు. ఆ తరువాత అంది:

'బావా నేనొక టడుగుతాను—ఏమీ అను కోవు కదూ?......'

'ఏమిటి?—'

'ఏమీ అనుకోనంటేనే—'

'కొత్తగా మాట్లాడుతున్నావు...ఏమీ అను కోను...అడుగు...'

'బావా—నువ్వు రాసే కథలన్నీ పత్రికల్లో ఎప్పటికప్పుడు చదివేస్తుంటాను...నీ కథలంటే నా కెంత ఇష మో తెలుసా?—చెప్పలేనంత ఇష్టం... ఇన్ని కథలు రాయాలంటే నీకు తీరిక ఎలా దొరుకు తుందో...అన్ని ఐడియాలు నీకెలా వస్తాయో—తలుచు కుంటే నువ్వో విచిత్రమైన మనిషి వనిపిస్తావు— కాని, బావా—నువ్వెప్పుడూ—పొద్దస్తమానమూ—కథల గురించే ఆలోచిస్తుంటావా......'

'............. ...'

'ఏం బావా అలా చూస్తావ్?—'

'ఈ అనుమానం నీకెందుకు కలిగింది రమా?—'

'బావా—'

'మరేం లేదు రమా......నువ్వే అన్నట్టు నేనో విచిత్రమైన మనిషినని నాకూ అప్పుడప్పుడూ అనిపిస్తుంటుంది. కథలు రాయడాన్ని ఒక పిచ్చిగా లెక్కించే వాళ్లు చాలామంది ఉండొచ్చు... కాని. నా మటుకు నాకు అదే ఒక ఆనందం అనిపిస్తుంది. ఎవరి పిచ్చి వారికి ఆనందమని ఊరికే అనలేదుకదా...నే నెప్పుడూ కథల గురించే ఆలోచిస్తుంటాను...అలా ఆలోచించడానిక్కాకపోతే నేను బ్రతకడం అనవసరమేమో అనిపిస్తుంది. అందులో బాధ ఉంది. కాని, ఆ బాధలోనే ఆనందంకూడా ఉంది. రచనలో కలిగే ఆనందంకోసం అందులోని బాధనుకూడా నేను స్వీకరిస్తాను. ఇప్పుడొక థీమ్ కోసం నేనెంతగా బాధపడుతున్నానో తెలుసా? నీకు తెలీదు రమా—నేను చెప్పలేను. ఈ బాధ మాటలకు అందేది కాదు—మాటలో చెబితే అర్థమయేదీ కాదు... ఆ బాధను అర్థం చేసుకోవాలనే వాడు ఆ బాధను అనుభవించే తీరాలి...రమా!...నా మనసెలాంటిదో నీకు తెలుసుగదా! ఇది వరకెప్పుడు కథ రాయాలనుకుని రాయకుండా ఉండిపోవడం జరగలేదు. కాని—కాని—ఈ పోటీకి కథ పంపాలంటేమాత్రం ఒక్క థీమ్‌కూడా తట్టడం లేదు. ప్లీజ్...రమా...ఎలాగైనా సరే...ఒక్కకథ—ఒకటంటే ఒకే ఒక్కకథకి థీమ్ చెప్పచాలు...ప్లీజ్...'

అతని మాటలు వింటూన్న రమ ముఖం సానుభూతితో నిండిపోయింది. 'సారీ బావా... నీ మనసెలాంటిదో నాకు తెలుసు...కాని, నా శక్తి ఎంతటిదో కూడా నీకు తెలుసు గదా......కథలల్లడం నాకు ఏ మాత్రమూ చేతకాదు...కథలు రాయకపోతే నువ్వు బ్రతకలేవేమో అన్నావు...ఆ మాట తలచుకుంటే నాకు చాలా భయమేస్తుంది బావా—కథలకోసమని జీవితంలోని ఇతర ఆనందాలను వదులుకోవడానికైనా సిద్ధపడడం...అంతమంచి పని కాదేమో అనుకుంటాను...అయినా నీకు చెప్పడానికి నేనెంతటి దాన్ని బావా?...నువ్వే మళ్లీ ఆలోచించు...అదుగో అత్తయ్య పిలుస్తోంది... వస్తున్నా నత్తయ్యా—మళ్ళీ వస్తాను బావా!...'

గదిలోంచి వెళ్ళిపోయింది రమ.

* * *

'బాహోయ్—బావా!...'

'ఓ—నువ్వా రమా...'

'ఇంకెవరనుకున్నావు? నీ ఊహా ప్రేయసి అనుకున్నావా?—'

రాజు నవ్వేడు—'నాకో ఊహాప్రేయసి ఉంటుందని ఎలా అనుకున్నావ్?—'

'ఎలా అనుకోవడమేమిటి? ఉండే తీరుతుంది. మీ కవులకీ కథకులకీ ఊహాప్రేయసు లుండబట్టే కదా కావ్యాలూ కథలూ నడుస్తుంటాయి—'

'అదేంలేదు రమా—ఊహకీ వాస్తవానికీ మధ్య నలిగిపోవడం ... ఆ సంఘర్షణలోంచి వేదనలోంచి మాటలరూపంలో హృదయావేశం వ్యక్తం కావడం... అదే రచన...'

'దిగిరాను దిగిరాను దివినుండి భువికి — అంటూ ఎవరో కవి— కృష్ణశాస్త్రిగారు కాబోలు— పాడేరు— అదేకదూ కళాకారుని వేదన...'

'అంతేకాదు—ఆ కళాకారుణ్ణి స్వప్నలోకంనుంచి ఈడ్చి పడెయ్యాలని చూస్తుంది లోకం— ఈ పాడు లోకం—'

'తామంతా లోకాతీతులం అనుకోవడం ఈ కళాకారుల భ్రమ అనుకుంటాను బావా ... లోకంతో సంబంధమే లేకపోతే ఈ కవులూ రచయితలూ అందరూ కూడా అడ్రసులేకుండా పోతారు...'

'రమా! రచయిత మనస్సు సున్నితం — మామూలు మనిషి భూకంపానికీ యుద్ధానికీ చలిస్తే రచయిత చుక్క మెరుపుకీ ఆకుపాటుకీ కూడా కలవరపడతాడు...'

'కాని, ఎంత రచయితైనా జీవితంలో మామూలు మనిషిపొందే అనుభవాల్ని కాదనకూడదు బావా...'

'నిత్యజీవితం !...ఏముంది ఈ నిత్యజీవితంలో? అంతా రొటీన్ రమా...స్విచ్ ఆన్‌చేస్తే తిరగడం

మొదలెట్టే యంత్రాలు ఈ మనుషులు...బ్రతుకుతున్నామనే స్పృహ లేకుండానే బ్రతకడం...బొమ్మలాట లాడుకుంటున్నట్లు పెళ్లిళ్లు చేసుకోవడం—పిల్లల్ని కనడం– జీవితం తమ కేమిచ్చిందో, తాము జీవితాని కేమిచ్చామో తెలుసుకోకుండానే చచ్చిపోవడం—అంతా రొటీన్ రమా...ఈ యంత్రాలకి గుండెకాయలైతే ఉంటాయిగాని, మనస్సు లుంటాయి...'

రమ నవ్వింది : 'మనస్సు—చాలా చిత్రమైన మాట కదూ బావా?—'

'ఏం అలా అన్నావ్?—'

మళ్లీ నవ్వింది రమ : 'ఏదో అనాలనిపించింది—అనేసేను బావా...నీలా బాగా ఆలోచించి మాట్లాడడం నాకు చాతకాదు...మనిషి గురించీ మనస్సు గురించీ నీకు తెలిసినంతగా నాకు తెలిసే అవకాశం కూడా లేదు. కాని, బావా...నీదెంతో సున్నితమైన మనస్సు...కల్పనా లోకాల్లో విహరించడం నీకు అలవాటు...కాని, వాస్తవ ప్రపంచం అందించే అమూల్యమైన అనుభూతుల్ని నువ్వెంతగానో కోల్పోతున్నావేమోనని నా అనుమానం...అంతే బావా...అంతకు మించి–నీకు–నేను–మరింకేమీ చెప్పలేను ..'

'రమా...'

'రేపు నేను ఊరికి వెళ్లిపోతున్నాను బావా—మళ్లీ నిన్నెప్పుడు—ఎలా—చూస్తానో తెలీదు—నీతో ఎంతో సరదాగా గడపాలని ఇక్కడి కొచ్చేను నేను...కాని, ఈ పదిహేనురోజుల్లోనూ ఏ రెండుమూడు సార్లో మాత్రమే నువ్వు నన్ను పలకరించేవు...పాపం—నువ్వేం చేస్తావు?......కథలు రాసే అడావుడిలో ఉన్నావ్...దట్సాల్‌రైట్ బావా...విష్ యు బెస్ట్ లక్...విష్ మి బెస్ట్ లక్......'

వెళ్లిపోయింది రమ.

* * *

'బావా !

నా అంతట నేనే ఉత్తరం రాస్తున్నందుకు ఆశ్చర్యపోతున్నావు కదూ ! ఈ ఉత్తరం చివరంటా చదివితే ఇంకా ఆశ్చర్యపోతావని నాకు తెలుసు. అయినా తప్పనిసరి అయి రాస్తున్నాను ... నిజానికి రెండునెళ్ళ క్రితం మీ ఊరినుంచి వచ్చేసినప్పటినుంచి ఇలాంటి ఉత్తరం నీకు రాయవలసి వస్తుందని నేనూ భయపడుతూనే ఉన్నాను.

ఎలా రాయాలో తెలియడంలేదు బావా — అయినా ప్రయత్నిస్తాను...

బావా! నువ్వంటే నాకెంతో ఇష్టం. నీ సున్నితమైన మనస్సుతో మంచితనంతో నిర్మలత్వంతో నువ్వు నన్ను చిన్నతనంనుంచి ఎంతగానో ఆకట్టుకున్నావు. నువ్వు అంత చక్కగా కథలు రాస్తావని తెలిసినప్పటినుంచి నీమీద నా అభిమానం మరింత పెరిగింది. రచయితగా లోకానికి ఒక రాజు తెలుసు. కాని, లోకానికంతటికీ లేని దగ్గర సంబంధం నాకు రచయిత రాజుతో ఉందని తలుచుకున్నప్పుడల్లా నా మనస్సు ఎంత ఆనందంతో ఉప్పొంగిపోయేదో తెలుసా బావా? చక్కనివాడు, మంచివాడు, మెత్తటి మనసువాడు, భావుకుడు, రసజ్ఞుడు– మా బావ– 'మా వారు' ఔతారనే తలపు కలగడంతో నాలో ఏయే మధురనాదాలు విరిసేవో తెలుసా బావా?

కాని,

రెండుమాసాల క్రితం కొద్దిరోజులు సరదాగా గడపాలని మీ ఊరొచ్చినప్పుడు నిన్ను చూసేక — నాతో నీ ప్రవర్తనను గమనించేక — నీమీద నా అభిప్రాయాలను మార్చుకోవలసి వచ్చింది.

బావా! ఆవేశపడకుండా చదువు–రచయితలనబడేవాళ్లు ఈ ప్రపంచంలో బ్రతుకుతూ అప్పుడప్పుడూ ఊహా జగత్తులో విహరిస్తూ కథలు రాస్తూ ఉంటారనుకున్నాన్నేను. కాని, నువ్వుమాత్రం అస్తమానం కథా ప్రపంచాల్లోనే ఉంటూ ఎప్పుడో నెలకో అయిదునిమిషాలుమాత్రం వాస్తవ ప్రపంచంలోకి ఒక్కసారి తొంగిచూసి మళ్లీ ముఖం తిప్పేసుకుంటావు. నువ్వు భావుకుడివి. నీ భావుకతలో పడి వాస్తవాన్ని కాదంటావు. నువ్వు ఊహాజీవివి.

ఊహల్లో పడి నిత్యజీవితపు టానందమయ సంఘట నల్నీ సన్నివేశాల్నీ వదులుకుంటానంటావు.

కల్పన నా కిష్టమే. కాని, అది మోతాదు మించడం నేను సహించలేను.

కథలు నా కిష్టమే. కాని, అవి జీవితాన్నే కబళించడం నేను భరించలేను.

బావా! నీ ఔన్నత్యాన్ని నేను అర్థం చేసుకో గలను. కాని, దానితో నా జీవితాన్ని ముడివెయ్యడానికి సాహసించలేను. నీ హృదయ కవాటాలు నన్ను ఆహ్వా నించినా నీ ఊహాప్రపంచపు బంగారు తలుపులు మాత్రం లోనికి అడుగు మోపనివ్వకుండా నన్ను ఆటంకపరుస్తాయి. ఇప్పుడు కళ్లు మూసుకుని నేను అడుగు ముందుకువేస్తే ఆ మూసిన తలుపులకి కొట్టు కొని నానుదురు తప్పకుండా చిట్లిపోతుంది. నీమీద నాకున్న అభిమానం కూడా నాలో ఇక మిగలదు.

అందుకే బావా—ఎంతో ఆలోచన మీద నేనొక నిర్ణయాని కొచ్చేను.

గుళ్లో దేవుడిలాంటి వాడివి నువ్వు

నిన్ను నేను ఆరాధించగలను. కాని, ప్రేమించ లేను.

నిన్ను నేను పెళ్లాడలేను.

నువ్వు ఒప్పుకున్నా అందుకు నేను ఒప్పుకోను. ఆ మాటే అమ్మతోనూ నాన్నతోనూ చెప్పేను. ఎంత గానో ప్రయత్నించేరుగాని, వాళ్లు నా నిర్ణయాన్ని మార్చలేక పోయేరు. వేరే సంబంధం చూడమన్నాను. చూసేరు. కుదిరింది.

ఆయన అమెరికాలో రిసెర్చ్ చేస్తున్నారు. పేరు శ్రీధర్. వచ్చే నెలే మన దేశం వస్తున్నారు. ఆయన రాగానే పెళ్లి జరిగిపోతుంది.

బావా ! నేను నిన్ను కష్టపెట్టేను. కాని, నిజం ఎప్పుడూ చేదుగానే ఉంటుందని నీకు తెలుసు గదా! నన్ను మరిచిపొమ్మని అడిగే సాహసం నాకు లేదు. ఎందుకంటే—నేనూ నిన్ను మరిచిపోలేను. ఎప్ప టికీ మనం మంచి స్నేహితులుగా ఉంటాం.

నీకు సాధ్యంకాదు. సాధ్యమైతే మాత్రం నన్ను క్షమించు బావా!...

ఇట్లు,
నీ దానిని కాలేకపోతున్న,
రమ.

నిర్ఘాంతపోయేడు రాజు.

ఒకసారి, రెండుసార్లు, మూడుసార్లు ... ఆ ఉత్తరాన్ని పదేపదే చదువుకున్నాడు.

ఉత్తరంలో ప్రతి అక్షరంలోనూ రమ ముఖమే కనిపించింది.

కళ్లు తిరిగిపోయేయి రాజుకి.

కాళ్లక్రింద భూమి చీలిపోతోందనిపించింది.

ప్రపంచం తల్లక్రిందులై పోతున్నట్టనిపించింది.

చెవుల్లో తుపాను హోరు... తెగిపోయే నరాలు... గుండెల్లోమంట...తలపై సమ్మెటపోట్లు...

'అబ్బా !—' అంటూ తల పట్టుకున్నాడు రాజు—

* * *

'అబ్బే—లాభం లేదండి... అసలింతకీ మనసులో చింతేమిటో చెబుతాడా అబ్బాయి ... ఐదురోజులు ఆహారం సరిగా లేదంటున్నారు ... జబ్బు అందుకే వచ్చిందని వేరే చెప్పాలా? కాప్స్యూల్స్ ఇచ్చేను — పోనీ—అవైనా వేసుకున్నాడా? ఇవ్వాల్టికి పదిరోజులు... కన్డిషన్ ఇప్పటికే సీరియస్‌గా ఉంది. ఇంకా ఆలస్యం చేస్తే లాభంలేదు. ఎలా నచ్చచెబుతారో నచ్చజెప్పి ఈ మందులైనా తాగించండి ... కనీసం నిద్రైనా బాగా పడుతుంది. ఆ కలవరింతలూ అవీ అయినా తగ్గు తాయి...ఆపైన మీ ఇష్టం—'

డాక్టరు వెళ్లిపోయేడు.

రాజు తల్లీ తండ్రీ ఒకరిముఖాలొకరు చూసు కున్నారు.

* * *

'చచ్చిపోతాను—నే చచ్చిపోతాను— 'అనుకున్నాడు రాజు కళ్లు మూసుకుని.

చీకట్లో గజిబిజిలో అతనికంతా అయో మయంగా ఉంది.

కంటిపాపకూ కనురెప్పకూ మధ్య అనంతమైన చీకటిలో—రమ!

'రమా—రమా—రమా—'

రాజు గుండెల చప్పుడులో ఆ రెండు అక్షరాలూ కొట్టుకుంటున్నాయి.

'రమా!—రమా—'

రమా—ఈ పిలుపుకి సమాధానం ఇవ్వవూ?

'బావా!—'

చల్లటి గొంతు. చల్లటి పిలుపు.

'బావా!—'

—అని మళ్లీ నన్ను అంత తియ్యగానూ పిలుస్తుందా రమ?—అనుకుంటున్నాడు రాజు.

'బావా!—నిద్రపోతున్నావా?...'

ఉలిక్కిపడ్డాడు రాజు. కళ్లు తెరిచేడు.

ఎదురుగా రమ ముఖం.

కళ్లు నులుముకుని చూసేడు రాజు.

రమ—

రమే!

రమే—వచ్చిందా?

ఎలా వచ్చింది?

ఎప్పుడొచ్చింది??

ఎందుకొచ్చింది???

'రమా!—'

అన్నాడు రాజు.

అతని గొంతు అతనికే బొంగురుగా వినిపించింది.

'రమా—రమా—నువ్వు—వచ్చేవా?!—'

'—నీకు సీరియస్‌గా ఉందని మామయ్య టెల్రిగ్రాం ఇచ్చేరు బావా—'

రమ వంక చూస్తూన్న రాజు ముఖం తెల్లగా పాలిపోయింది.

'అయితే రమా—ఎందుకొచ్చేవ్ — ఎందుకొచ్చేవ్ నువ్విప్పుడు—ఎందుకొచ్చేవ్ రమా?—'

'—నామీద కోపమా బావా నీకు?—'

'హుః— కోపం — నీమీద కోపం! — నీమీద కోపం చేసుకోవడానికి నే నెవర్నిలే రమా—'

'బావవి.'

'బావని—అంతే-ఆఫ్టరాల్ బావని-'

'అలా మాట్లాడకు బావా!— నిజం చెప్పు నామీద నీకు కోపంలేదూ?—'

'కోపం!— ఎందుకూ?—'

'—నేను చేసిన పనికి—'

'నువ్వేం చేసేవ్? నీ సుఖం నువ్వు చూసుకున్నావ్ — నా గురించి నీ అభిప్రాయమేమిటో చెప్పేవ్ — నిజంగా సరీగ్గానే చెప్పేవ్ రమా... నేను నీకు తగను ... నేనొట్టి ఫూల్‌ని... నిన్ను చేసుకుంటే నువ్వు ఏమాత్రమూ సుఖపడలేవు...'

రాజు మాటల్నివిని, రమ అతడివేపు నిశ్చలంగా చూసింది.

రాజు ముఖం మరింత గంభీరంగా మారిపోయింది — 'నేను చాలా దురదృష్టవంతుణ్ణిలే రమా' అంటూన్నాడు.

రాజు భుజంమీద చెయ్యివేసింది రమ—'లేవగలవా ఇప్పుడు నువ్వు—'

గమ్మున లేచేడు రాజు, అతణ్ణి చెయ్యి పుచ్చుకుని నడిపించి తోటలో మల్లెపందిరికింద అరుగుమీద కూచోబెట్టింది రమ— 'పిచ్చిబావా— ఇప్పుడు చెప్పు -ఎందుకిలా అయిపోయేవ్? ఊ?— నా ఉత్తరం అందిందా?—'

అతి ప్రయత్నంమీద అంటున్నట్టు అన్నాడు రాజు — 'రమా! జరిగిందేదో జరిగిపోయింది ... ఆ సంగతి మళ్లీ కదిలించకు—'

గల్లుమని నవ్వింది రమ.

నివ్వెరపోయేడు రాజు.

చాలా సేపట్నుంచి అణచిపెట్టుకున్న నవ్వు కాబోలు— గుక్క తిప్పుకోకుండా ఇంకా నవ్వుతూనే ఉంది రమ.

'రమా— రమా— ఎందుకు నవ్వుతావ్?—' అన్నాడు రాజు తికమకగా.

'బావా! ఇంక నే నాపుకోలేను. చెప్పేస్తాను— ఆ ఉత్తరం నిజమనుకుంటున్నావా నువ్వు— లేదు— సరదాకి రాసేను— నాకేమిటి— నీతోకాక ఇంకొకరితో పెళ్ళేమిటి?— సరదాకి రాసేను బావా—'

రాజు ముఖంలో ఆశ్చర్యం. సంభ్రమం, నమ్మలేనితనం—'సరదాకా?— స–ర–దా–కా!?— రమా— నువ్వేమంటున్నావ్?!—'

'అవును బావా! ... ఒట్టు—నమ్ము— ఆ ఉత్తరంలోఉన్న ఒక్కముక్కకూడా నిజం కాదు—'

రాజు ముఖంలో ఆశ్చర్యం ఆనందంగా మారిపోయింది— 'ఏమిటి— ఏమిటీ ... అయితే మరి ఆ ఉత్తరం అలా ఎందుకు రాసేవ్ రమా?...'

'నన్నో కథ చెప్పమన్నావ్ కదూ బావా! ... కథలు నాకు రావన్నాను—అయినా బలవంతం చేసేవ్— నేను కథ చెప్పలేదని చిన్నబుచ్చుకున్నావ్ — అందుకని...'

'అందుకని!— 'రాజు కళ్ళలో భావాలు గిర్రున తిరిగేయి— 'ఎంతపని చేసేవ్ రమా! ఎంత ఖంగారు పెట్టేసేవ్! నువ్వే గనక ఇప్పుడు రాకపోయిఉంటే నేనేమైపోయి ఉండేవాణ్ణో— అవునూ— మరి— ఆ శ్రీధర్...'

'కథలోని ఒక పాత్రమాత్రమే ... అందులోని సంఘటనలూ వ్యక్తులూ అంతా కేవలం కల్పితం ... నీ మనసు నొప్పించేనేమో— నన్ను క్షమించు బావా—'

—అంటూ తల దించుకుంది రమ.

